APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త


ప్రచురణ : శ్రీ సత్యసాయి / అనంతపురం ఎడిటర్ : సి హరికృష్ణ ఆదివారం 07, జూన్ 2026 సంపుటి: 01 సంచిక :11 పేజీలు : 04 వెల: 2-00/-

## పనితీరు లేనివారికి పార్టీలో స్థానం లేదు

- సర్వేలతోనే నాయకుల భవితవ్యంక్యాడర్‌కు సీఎం చంద్రబాబు హెచ్చరిక
- ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలు

మంగళగిరి, జూన్ 6 : తెలుగుదేశం పార్టీలో ఇకపై పనితీరు, ప్రజల్లో ఆదరణ ఉన్న వారికే ప్రాధాన్యం ఉంటుందని సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజల అభిప్రాయాలు, పార్టీ కార్యకర్తల సూచనలు, క్షేత్రస్థాయి సర్వేల ఆధారంగానే నాయకుల భవిష్యత్తుపై నిర్ణయాలు తీసుకుంటామని తేల్చిచెప్పారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన "కాఫీ కబుర్లు" కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

పార్టీ పదవులు, ఎన్నికల టికెట్లు, సంస్థాగత బాధ్యతల విషయంలో ఇకపై సర్వేలకు అత్యంత



ప్రాధాన్యం ఉంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజలకు దూరంగా ఉండే వారు, పార్టీకి నష్టం కలిగించే వారు, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారికి పార్టీలో చోటు ఉండదని హెచ్చరించారు. రాష్ట్రం, పార్టీ ప్రయోజనాల కోసం అవసరమైతే కఠిన నిర్ణయాలు

2లో



2లో

## రాష్ట్రంలోకి రుతుపవనాల రాక

- కేరళ తీరాన్ని తాకిన వర్షాలు
- ఏపీలోకి త్వరలో ప్రవేశం
- రైతుల్లో పెరిగిన ఆశలు

అమరావతి, జూన్ 6 (అనంత సూర్య): దేశవ్యాప్తంగా ప్రజలు ఆసక్తిగా ఎదురుచూ-స్తున్న నైరుతి రుతుపవనాలు భారత ప్రధాన భూభాగంలోకి ప్రవేశించాయి. జూన్ 4న కేరళ తీరాన్ని తాకినట్లు భారత వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుతం

## ఎన్‌ఆర్‌ఐ భక్తులకు టీటీడీ శుభవార్త



**దర్శన గడువు మూడు నెలలకు పెంపు**

**సుపథం మార్గంలో మరింత వెసులుబాటు**

**ఆపన్న హృదయ పథకానికి ఆదరణ**

తిరుమల, జూన్ 6 (అనంత సూర్య): విదేశాల్లో నివసిస్తూ తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలని కోరుకునే ఎన్‌ఆర్‌ఐ భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం శుభవార్త చెప్పింది. సుపథం మార్గంలో లభించే ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఉన్న గడువును 30 రోజుల నుంచి 90 రోజులకు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఎన్‌ఆర్‌ఐ భక్తులు భారత్‌కు వచ్చిన 30 రోజుల లోపే తమ ఒరిజినల్ పాస్‌పోర్ట్, సంబంధిత పత్రాలతో తిరుమలలోని సుపథం కౌంటర్ వద్ద

2వ పేజీలో



2లో

## పీఎం సూర్యఘర్‌కు శ్రీకారం

- 68 ఇళ్లకు మంజూరు
- సోలార్ పనులు వేగవంతం
- హరిత విద్యుత్‌కు ప్రాధాన్యం
- మంత్రి గొట్టిపాటి రవి కుమార్

## మహిళల భద్రతే ప్రభుత్వ లక్ష్యం



2లో

**మార్కాపురం పోలీసులతో మంత్రి సమీక్ష**

**మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం**

**నేరాల నియంత్రణలో మెరుగైన ఫలితాలు**

కనిగిరి, జూన్ 6 (అనంత సూర్య): మహిళలు, బాలికల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. కనిగిరిలో నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని శాంతిభద్రతలు, మహిళల రక్షణ, నేరాల నియంత్రణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ మైనర్ బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో మరింత కఠిన

## అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన చిరాగ్ పాస్వాన్, అనిత



2 లో

**కనిగిరిలో ఘన కార్యక్రమం**

**బాబాసాహెబ్‌కు నివాళులర్పించిన నేతలు**

**ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపు**

కనిగిరి, జూన్ 6 (అనంత సూర్య): మార్కాపురం జిల్లా కనిగిరిలో రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పా-స్వాన్, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాట్లాడిన కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్, భారత రాజ్యాంగ రూపకర్తగా డాక్టర్ అంబేద్కర్ దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల కోసం ఆయన చేసిన కృషి దేశ ప్రజలకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటుందని పేర్కొన్నారు. యువత అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## కోహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్

- ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన
- రూ. 2,300 కోట్లతో భారీ ప్రాజెక్టు
- రైతులకు, వినియోగదారులకు ప్రయోజనం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రంగారెడ్డి, జూన్ 6 (అనంత సూర్య): హైదరాబాద్ మహానగర అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత పండ్ల మార్కెట్‌ను నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



2లో

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఓఆర్ఆర్ లోపలి ప్రాంతంలో ప్రస్తుతం 1.34 కోట్ల జనాభా నివసిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రా-జెక్టును రూపొందించినట్లు తెలిపారు.



## ఆంధ్ర బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభం

- ఘనంగా ప్రారంభోత్సవం
- క్రీడాకారులకు ప్రోత్సాహం
- యువతకు స్ఫూర్తిగా టోర్నీ
- మంత్రి కొల్లు రవీంద్ర

2 లో

విజయవాడ, జూన్ 6 (అనంత సూర్య): విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ స్టేడియంలో గుడిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్--2026 పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. పోటీల ప్రారంభోత్సవ

# పనితీరు లేనివారికి పార్టీలో స్థానం లేదు



(మొదటి పేజీ తర్వాత)

తీసుకోవడానికి వెనుకాడబోనని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ భవిష్యత్తుపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేసిన ఆయన, ప్రజలకు దగ్గరగా ఉండడం, అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా అమలు చేయడం వల్ల పార్టీ మరింత బలపడుతోందన్నారు. ఆత్మపరిశీలన చేసుకుంటూ ముందుకు సాగుతున్నందున పార్టీకి ఓటమి అనే మాట ఉండదని ధీమా వ్యక్తం చేశారు.

మంగళగిరి నియోజకవర్గాన్ని ఉదాహరణగా ప్రస్తావిస్తూ నారా లోకేష్‌ను అభినందించారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా వెనుకడుగు వేయకుండా ప్రజల్లోనే ఉంటూ కష్టపడి పనిచేశారని, అదే పట్టుదలతో 2024లో ఘన విజయం సాధించి మంగళగిరిని టీడీపీకి కంచుకోటగా మార్చారని కొనియాడారు. ప్రతి నాయకుడు, కార్యకర్త అలాంటి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేసిన చంద్రబాబు, ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న డీఎస్సీ నియామకాలపై తప్పుడు ప్రచారం జరిగినప్పటికీ, వాస్తవాలను ప్రజల ముందుంచి దుష్ప్రచారాన్ని తిప్పికొట్టగలిగామని పేర్కొన్నారు.

కూటమి ఐక్యతే విజయానికి ప్రధాన కారణమని గుర్తుచేసిన చంద్రబాబు, క్షేత్రస్థాయిలో కూడా అదే సమన్వయం కొనసాగాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు.

# మహిళల భద్రతే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తర్వాత)



కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మహిళలు భయరహిత వాతావరణంలో జీవించేలా పోలీసు శాఖ అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలో మహిళలపై నేరాలను 17 శాతం తగ్గించడంలో కృషి చేసిన జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజును మంత్రి అభినందించారు. నేరాల నియంత్రణలో పోలీసులు సాధిస్తున్న ఫలితాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని అన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని అధికారులకు సూచించారు. మత్తు పదార్థాల వ్యాప్తిని నిరోధించడంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు.

పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితులతో సానుభూతితో వ్యవహరించాలని, వారికి వేగవంతమైన సేవలు అందించాలని మంత్రి అనిత ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పోలీసు శాఖ మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా పోలీసు అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొని మహిళల భద్రత, నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అనిత స్పష్టం చేశారు.

# రాష్ట్రంలోకి రుతుపవనాల రాక

(మొదటి పేజీ తర్వాత)



అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుతం రుతుపవనాల కదలిక చురుగ్గా కొనసాగుతుండటంతో ఆంధ్రప్రదేశ్‌లో కూడా త్వరలో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సాధారణంగా జూన్ 1న కేరళలోకి ప్రవేశించే రుతుపవనాలు ఈ ఏడాది మూడు రోజుల ఆలస్యంగా చేరుకున్నాయి. ఇప్పటికే కేరళ, కర్ణాటక, తమిళనాడు, గోవాలోని పలు ప్రాంతాలకు విస్తరించి అక్కడ విస్తారంగా వర్షాలు కురిపిస్తున్నాయి.

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జూన్ 6 నుంచి 8వ తేదీ మధ్య నైరుతి రుతుపవనాలు రాయలసీమ ప్రాంతంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే రాష్ట్రంలో వేగంగా విస్తరించే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. అమరావతి, విశాఖపట్నం వాతావరణ కేంద్రాల సమాచారం ప్రకారం జూన్ 10 నాటికి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌ను పూర్తిస్థాయిలో తాకే అవకాశం ఉంది. అనంతరం జూన్ 15 నాటికి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి సాధారణ వర్షాలు కురిపించే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు తెలిపారు.

రుతుపవనాల రాకతో ఎండల తీవ్రత తగ్గి ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతాయని అంచనా వేస్తున్నారు. దీంతో ప్రజలకు ఉపశమనం లభించనుండగా, ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు రైతులు సిద్ధమవుతున్న నేపథ్యంలో రుతుపవనాల రాక కీలకంగా మారింది. ఈసారి సాధారణ వర్షపాతం నమోదైతే పంటల సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని వ్యవసాయ శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన చిరాగ్ పాస్వాన్, అనిత

(మొదటి పేజీ తర్వాత)

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. విద్య, స్వాభిమానం, సామాజిక చైతన్యంతోనే అభివృద్ధి సాధ్యమని ఆయన చూపిన మార్గం నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని చెప్పారు. రాజ్యాంగ విలువల పరిరక్షణ ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమసమాజ నిర్మాణం కోసం అందరూ కలిసి పనిచేయాలని ఇద్దరు మంత్రులు పిలుపునిచ్చారు. దేశ ప్రగతి, సామాజిక సమానత్వం కోసం బాబాసాహెబ్ చూపిన బాటలోనే ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తామని నాయకులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

# ఆంధ్ర బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభం

(మొదటి పేజీ తర్వాత)

పోటీల ప్రారంభోత్సవ సందర్భంగా క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కొల్లు రవీంద్ర, క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. బ్యాడ్మింటన్ వంటి క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి కూడా దోహదపడతాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ యువ క్రీడాకారులకు ఇలాంటి పోటీలు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారు. ప్రతిభావంతులైన ఆటగాళ్లను గుర్తించి ప్రోత్సహించడంలో ఈ పోటీలు కీలక పాత్ర పోషించనున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు, నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి ఈ టోర్నీ మరింత ఊతమిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# ఎన్‌ఆర్‌ఐ భక్తులకు టీటీడీ శుభవార్త

(మొదటి పేజీ తర్వాత)

సుపథం కౌంటర్ వద్ద హాజరై ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ పొందాల్సి ఉండేది. ఈ నిబంధన వల్ల అనేక మంది భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో టీటీడీ ఈ నిర్ణయం తీసుకుంది.

కొత్త నిర్ణయంతో విదేశాల నుంచి వచ్చిన భక్తులు భారత్‌లో అడుగుపెట్టిన తేదీ నుంచి మూడు నెలల వ్యవధిలో ఎప్పుడైనా సుపథం దర్శన సౌకర్యాన్ని పొందవచ్చు. దీంతో తమ ప్రయాణ ప్రణాళికలకు అనుగుణంగా శ్రీవారిని దర్శించుకునేందుకు మరింత వెసులుబాటు కలగనుంది. మరోవైపు టీటీడీ నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వర ఆపన్న హృదయ పథకానికి దాతల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పథకంలో భాగంగా ట్రస్టుకు లక్ష రూపాయల విరాళం అందించే దాతలకు కుటుంబ సభ్యులతో కలిపి ఐదుగురికి ప్రత్యేక వీఐపీ బ్రేక్ దర్శన సౌకర్యం కల్పిస్తున్నారు.

ఈ సౌకర్యాన్ని పొందాలనుకునే భక్తులు దర్శనానికి ఒక రోజు ముందు తిరుమలలోని దాతల విభాగంలో విరాళం చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం ఐదుగురికి వీఐపీ బ్రేక్ దర్శన టికెట్ల కోసం అదనంగా నిర్ణీత రుసుము చెల్లించాల్సి ఉంటుంది. దాతల సౌకర్యార్థం తిరుమలలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. భక్తులకు శ్రీవారి దర్శనాన్ని మరింత సులభతరం చేయడం, విదేశాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించడమే ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు.

# కోహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్

(మొదటి పేజీ తర్వాత)





240 ఎకరాల్లో రూ. 2,300 కోట్ల వ్యయంతో అత్యాధునిక సదుపాయాలు కలిగిన పండ్ల మార్కెట్‌ను నిర్మించనున్నట్లు వెల్లడించారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత ప్రపంచస్థాయి గుర్తింపు పొందే ప్రాజెక్టుగా ఇది నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా ఒకప్పుడు పండ్లు, కూరగాయల సాగుకు ప్రసిద్ధి చెందిందని గుర్తు చేసిన ముఖ్యమంత్రి, రియల్ ఎస్టేట్ విస్తరణతో వ్యవసాయ భూములు తగ్గిపోయాయని అన్నారు. ప్రస్తుతం పండ్లు, కూరగాయల కోసం ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.

కూరగాయలు, పండ్ల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. స్థానిక ప్రజల సహకారంతో ఈ మార్కెట్‌ను ప్రారంభిస్తున్నామని, వచ్చే రెండేళ్లలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసామని తెలిపారు. పనుల కోసం నిధుల కొరత లేకుండా గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా సమీకృత సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయానికి కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక వసతులతో కార్యాలయ సముదాయాలను నిర్మిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని 39 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, మెట్రో విస్తరణ వంటి ప్రాజెక్టులతో హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతును రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, రంగారెడ్డి జిల్లా అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి నాంది అని పేర్కొన్నారు.

# పీఎం సూర్యఘర్‌కు శ్రీకారం



(మొదటి పేజీ తర్వాత)

అద్దంకి, జూన్ 6 (అనంత సూర్య): అద్దంకి నియోజకవర్గంలోని జె. పంగులూరు మండల పర్యటనలో భాగంగా ఆరికట్లవారిపాలెం గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ ఉచిత సోలార్ పథకాన్ని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా ఈ కార్యక్రమం కీలకంగా మారనుందని ఆయన తెలిపారు. ఈ గ్రామంలో మొత్తం 68 గృహాలకు పీఎం సూర్యఘర్ కనెక్షన్లు మంజూరు కాగా, ఇప్పటికే 28 ఇళ్లలో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. మిగిలిన గృహాల్లో కూడా పనులు వేగంగా కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో రాష్ట్రానికి 20 లక్షల సోలార్ కనెక్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 6 లక్షల కనెక్షన్లు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సంప్రదాయ విద్యుత్‌పై ఆధారాన్ని తగ్గిస్తూ పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ ద్వారా కుటుంబాల విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు లభిస్తుందని వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆధునిక విద్యుత్ సదుపాయాలను విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పునరుత్పాదక విద్యుత్ రంగంలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య అమలు చేయాలి

## – ఏపీయూడబ్ల్యూజే డిమాండ్



అనంతపురం జూన్ 06 అనంత సూర్య : జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, కొన్నేళ్లుగా అనంతపురం ఉమ్మడి జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో అమలు అవుతున్న ఉచిత విద్యా సదుపాయాన్ని ఈ విద్యా సంవత్సరంలో కూడా కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) నాయకులు డిమాండ్ చేశారు.

యూనియన్ జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆయుఫ్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ) ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సిన నిబంధన అమలులో భాగంగా జర్నలిస్టుల పిల్లలకు కూడా ఈ అవకాశం కల్పించాలని కోరారు. ప్రతి సంవత్సరం కలెక్టర్ ఆదేశాల మే-రకు విద్యాశాఖ ప్రైవేటు విద్యాసంస్థలకు మెమో జారీ చేస్తుందని, ఈ ఏడాది కూడా వెంటనే ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

గత ఏడాది అప్పటి కలెక్టర్ వినోద్ కుమార్ జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో రాయితీ కల్పిస్తూ మెమో జారీ చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న రిపోర్టర్లు, స్ట్రింగర్లు, కాంట్రిబ్యూటర్లు నామమాత్రపు గౌరవ వేతనాలతోనే కుటుంబాలను పోషిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో కొనసాగుతున్న కరువు పరిస్థితుల కారణంగా చాలా మంది జర్నలిస్టులు తమ పిల్లల పాఠశాల ఫీజులు చెల్లించలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందువల్ల జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ లేదా ఉచిత విద్య అమలయ్యేలా విద్యాశాఖకు తక్షణమే ఆదేశాలు జారీ చేసి, పాఠశాలలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాకముందే అమలు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

ఈ కార్యక్రమంలో అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మహమ్మద్ రసూల్, ఆర్‌వీఎస్ ప్రసాద్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు నాగేంద్రనాథ్ రెడ్డి, యూనియన్ స్టేట్ కౌన్సిల్ సభ్యులు బాల రంగారెడ్డి, కేపీ కుమార్, చిన్న పత్రికల నాయకులు చౌదప్ప, చలపతి, సనప రామకృష్ణ, లోకరాజు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో యోగాంధ్ర-2026 కార్యక్రమాలను విజయవంతం చేయాలి

అనంతపురం, జూన్ 6 అనంత సూర్య న్యూస్ : ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్న యోగాంధ్ర-2026 కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మే-రకు అనంతపురం జిల్లాలో దివ్యాంగ థీమాటిక్ యోగా, టూరిజం డెస్టినేషన్ యోగా తదితర యోగాంధ్ర-2026 కార్యక్రమాలను షెడ్యూల్ మేరకు నిర్వహించాలన్నారు. యోగాంధ్ర-2026 కార్యక్రమాల నిర్వహణ, ఏర్పాట్లు, రిజిస్ట్రేషన్లు, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలను పటిష్టంగా చేపట్టాలని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రజలకు యోగాను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యోగాంధ్ర-2026 కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఆనందాన్ని అందించే యోగాను ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం చేయాలనే ఉద్దేశంతో విస్తృత కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు జిల్లా స్థాయి ప్రధాన యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి ముందుగా జిల్లాలోని పలు ప్రముఖ పర్యాటక ప్రదేశాలు, గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 16న దివ్యాంగులతో థిమాటిక్ యోగా, 18న బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం, 20న గుత్తి కోటలో ప్రత్యేక పర్యాటక డెస్టినేషన్ యోగా ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.



యోగ పోటీలు నిర్వహణ :

యోగాపై ఆసక్తి పెంపొందించేందుకు పోటీలను నాలుగు స్థాయిల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ 7 నుంచి గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలలో యోగా పోటీలు షెడ్యూల్ మేరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల నిర్వహణలో విద్యాశాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్, తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి గ్రామం, వార్డులో యోగా బృందాలను ఏర్పాటు చేసి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని ఆదేశించారు. జిల్లాలోని మాస్టర్ ట్రైనర్లు, శిక్షకులు, విద్యార్థులు, యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థలు, పౌరులు పెద్ద సంఖ్యలో యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని చర్యలు తీసుకోవాలని అన్నారు.

# రెండేళ్లలో రూ. 6.04కోట్లు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేశాం



అనంతపురం, జూన్ 6 అనంత సూర్య న్యూస్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రూ. 6.04కోట్లు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేశామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 8మందికి రూ. 12.56లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, లబ్ధిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే దగ్గుపాటితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ పేదవాని ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపరచడంతో పాటు అత్యవసర పరిస్థితులలో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్న వారిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఒక్క అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోనే 596మందికి రూ. 6.04కోట్లు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేసినట్టు వివరించారు. అదే గత ఐదేళ్ల మొత్తానికి ఎంత మందికి ఎంత సాయం చేశారో చెప్పగలరా అని వైసీపీ నాయకులను నిలదీశారు. పేదల ఆరోగ్యం విషయంలో ఇంత ఉదారంగా స్పందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లకు ప్రజల తరుపున ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# 12వ తేదిలోపు హౌస్ మ్యాపింగ్ పూర్తి చేయండి



అనంతపురం, జూన్ 6 అనంత సూర్య న్యూస్ : ఈనెల 12వ తేదీలోగా హౌస్ మ్యాపింగ్ పూర్తి చేయాలని పార్టీ శ్రేణులకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన ఎస్ఐఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్, కోక్లస్టర్లు, యూనిట్, కో యూనిట్ ఇన్ ఛార్జిలు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అసలు ఎస్ఐఆర్ ప్రక్రియ అంటే ఏంటి.. ఎందుకు చేస్తారన్నది నేతలు కూలంకశంగా వివరించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ ఎస్ఐఆర్ ప్రాధాన్యతను ప్రత్యేకంగా చెప్పారు. ప్రతి 20-25 ఏళ్లకోసారి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతుందని.. 2002 ఓటర్ల జాబితాను పరి గణలోకి తీసుకుని 'సర్' ప్రక్రియను చేపడుతున్నట్లు చెప్పారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తా-రన్నారు. ఈ విషయంలో పార్టీ నేతలు పూర్తి సా- యిలో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు. ఈ రెండు సార్లు మ్యాపింగ్ జరిగేలోగా ఓట్ల చేరికలు పర్ఫెక్టుగా పూర్తి కావాలన్నారు. ాx=ను అందరూ సీరియస్‌గా తీసుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆయన తెలిపారు. ఓట్లు నమోదు చేసుకోవడం ఓటర్ల బాధ్యత అని.. అలాగే ఓట్ల నమోదు చేయించే విధంగా పార్టీ శ్రేణులు చొరవ చూపాలన్నారు. ఓట్ల చేరికలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎస్ఐఆర్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ ఎన్నికలకైనా ఓటర్ల జాబితా అనేది చాలా కీలకమని.. ఓటర్ల జాబితా ఆధారంగానే ఎన్నికల్లో వ్యూహాలు అమలు చేయగలమన్నారు. గతంలో వైసీపీ నాయకులు ఓట్ల విషయంలో చేసిన అక్రమాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఎక్కడైనా అర్హులు కాని వారు ఓట్లు ఉంటే వెంటనే వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రతి బీఎల్ఏ హౌస్ మ్యాపింగ్ ను పూర్తి చేయాలన్నారు. అవసరమైతే రెండవ సారి కూడా మ్యాపింగ్ కు వెళ్లాలన్నారు. ఈ వారం రోజులు చాలా కీలకమని.. ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే దాని ప్రభావం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కచ్చితంగా పడుతుందన్నారు. అందుకే 'సర్'ను అందరూ సీరియస్ గా తీసుకోవాలని... ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. పార్టీ అధిష్టానం పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేస్తోందని.. ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే అది వెంటనే తెలిసిపోతుందన్నారు. బీఎల్ఏల దగ్గర నుంచి క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్ ల వరకు దీనిని బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, క్లస్టర్ ఇన్చార్జులు సరిపూటి రమణ, డిష్ నాగరాజు, రాజారావు, దలవాయి రమాదేవి, సాక్షి లక్ష్మీనరసింహ, వన్నూరప్ప, గోపాల్ గౌడ్, కృష్ణం రఘు, కాయగూరల శ్రీధర్, పొట్లూరి కేశవ నాయుడు, జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి నాయుడు, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు పిఎల్ఎన్ మూర్తి, కడియాల కొండన్న తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఎస్ఐఆర్ - 2026 చేపడతాం



అనంతపురం, జూన్ 6 అనంత సూర్య న్యూస్ : జిల్లాలో ఎస్ఐఆర్ - 2026 కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. ఎస్ఐఆర్ - 2026పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలన్నారు. అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 2002లో ఉన్న ఓటర్లు మరియు 2025 లో ఉన్న ఓటర్లు మరియు వారి పిల్లలకు సంబంధించిన మ్యాపింగ్ 68 శాతం పూర్తయిందని తెలిపారు. మ్యాపింగ్ 90 శాతంకి తక్కువ కాకుండా పూర్తి అయ్యేలా అందులో భాగంగా బిఎల్ఓలు 07.06.2026 నుంచి 14.06.2026 వరకు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓలతోపాటు బిఎల్ఎలు పాల్గొని సహకరించాలని, బిఎల్ఓలతో సహకరించాలని బిఎల్ఏలకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలియజేయాలని సూచించారు.

లిఎస్ఐఆర్ షెడ్యూల్ వివరాలు :లి

ఫోటో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణను చేపట్టేందుకు షెడ్యూల్ మరియు వివరణాత్మక సూచనలను భారత ఎన్నికల సంఘం జారీ చేసిందని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యాచరణలో భాగంగా 05.06.2026 నుండి 14.06.2026 వరకు తయారీ, శిక్షణ, ప్రింటింగ్, 15.06.2026 నుండి 14.07.2026 వరకు బిఎల్ఓల ద్వారా ఇంటింటి సందర్శనలు చేసి ఎన్యుమరేషన్ ఫారాలు రెండు ఇవ్వడం జరుగుతుంది మరియు అందులో ఒక పూరించిన ఎన్యుమరేషన్ ఫారం తిరిగి తీసుకోవడం జరుగుతుందన్నారు. 14.07.2026 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, 21.07.2026 న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, 21.07.2026 నుండి 20.08.2026 వరకు క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాలను దాఖలు చేయడానికి కాలపరిమితి, 21.07.2026 నుండి 18.09.2026 వరకు నోటీసు దశ/క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల పరిష్కారం, 22.09.2026న తుది ఓటర్ల జాబితా ప్రచురణ చేయడం జరుగుతుందని తెలిపారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులు మరియు మార్గదర్శకాల ఆధారంగా చేర్పులు/సవరణలకు లోబడి సర్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు అందరు బిఎల్ఏలను నియమించాలని సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీలోపు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జరిగిందని, ఈ శిక్షణ కార్యక్రమాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఆ నోటీసులకు తిరిగి సంబంధిత ఓటరు సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు సంబంధించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ శ్యాముల్, బిజెపి ప్రతినిధి ఈశ్వర్ ప్రసాద్, బీఎస్పీ ప్రతినిధి అంజయ్య, టిడిపి ప్రతినిధి నారాయణస్వామి, వైఎస్ఆర్సిపి ప్రతినిధి అమర్నాథ్ రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి మసూద్ వలి, సిపిఐ (ఎం) బాలరంగయ్య, కాంగ్రెస్ ప్రతినిధి బషీర్, జనసేన పార్టీ ప్రతినిధి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

# చంద్రబాబు కూటమి పాలనలో మైనారిటీలకు రక్షణ లేదు



**– తాడేపల్లి లోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మైనారిటీ విభాగం సమావేశం**

అనంతపురం, జూన్ 6 అనంత సూర్య న్యూస్ : పేదలైన ముస్లింల ఆర్థిక పరిస్థితిని ఆసరాగా చేసుకుని మోసపు హామీలు గుప్పించి ఓటేయించుకున్న చంద్రబాబు, అధికారం లోకి వచ్చాక ఏ ఒక్కటీ నెరవేర్చకుండా వెన్నుపోటు పొడిచాడని వైయస్సార్సీపీ మైనారిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మైనారిటీ విభాగం రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఎన్నికల్లో హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక మోసం చేయడం చంద్రబాబుకి అలవాటైపోయిందని మండిపడ్డారు. కూటమి పాలనలో మైనారిటీలకు ప్రోత్సాహం, గౌరవం మాత్రమే కాకుండా కనీసం రక్షణ కూడా కరువైందని ధ్వజమెత్తారు. దివంగత వైయస్సార్ తర్వాత మైనారిటీల పక్షాన నిలబడి రాజకీయంగా ప్రోత్సహించిన ఘనత వైయస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రస్తుతం ఎస్ఐఆర్ పేరుతో జరుగుతున్న ఓటర్ లిస్టు సవరణ విషయంలో మైనారిటీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఓటు విషయంలోనూ జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా సజ్జల రామకృష్ణ రెడ్డి, అప్పి రెడ్డి లను అనంతపురం మాజీ మేయర్ వసీం సలీం, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గౌస్ బేగ్, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు మొఘల్ సైపుల్లా బేగ్, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శులు వేముల నదీమ్, రహంతుల్లా కలిసి సన్మానించారు.

# సంస్కారం లేని మాటలు మాట్లాడితే మూతి పళ్ళు రాలుతాయి ప్రకాష్ రెడ్డి..



అనంతపురం, అనంత సూర్య న్యూస్ : పరిటాల కుటుంబంపై సభ్యతా సంస్కారం లేని మాటాలు మాట్లాడితే దవడలు పగిలి మూతిపళ్లు రాలుతాయి ప్రకాష్‌రెడ్డీ.. అని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 వరకు బందిపోట్లు పాలన చేశారని నియోజకవర్గం ప్రజలు నిన్ను ఓడించారన్నది గుర్తుంచుకోవాలన్నారు. నీవు, నీ కుటుంబ సభ్యులు అవినీతి రాక్షసులు అని, రాప్తాడు నియోజకవర్గంలో దోపిడి చేశారని, మాఫియా పాలన సాగించారన్నారు. అమ్మ డైరీ పేరుతో డ్వాక్రా మహిళలతో రూ.10 కోట్లు వసూలు చేసి నాలుగేళ్లు రియల్ ఎస్టేట్ దందాలు చేసి వందల కోట్ల రూపాయలు సంపాదించుకొని అమ్మ డైరీ కట్టి మీ అమ్మ ను డైరీ చైర్మన్ గా నియమించడం నిజం కాదా ప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. జగనన్న ఇల్లు పేరుతో వందల కోట్ల రూపాయలు ముందస్తు బిల్లులు చేసుకొని కనీసం ఏ ఒక్కరికి కూడా ఇల్లు పూర్తి చేయకుండా పేదలను మోసం చేసింది వాస్తవం కాదా.. పేరూరు డ్యాం పనులు ప్రారంభం చేయకుండా రైతులను మోసం చేసింది వాస్తవం కాదా.. వైసీపీ అధికారాన్ని అడ్డం పెట్టుకొని రాప్తాడు నియోజకవర్గంలో ఇసుక, ఎర్రమట్టి మాఫియా వెంచర్ వేసిన వాళ్ళతో ఎకరాకు 10 లక్షలు అక్రమంగా వసూళ్లు చేసింది వాస్తవం కాదా.. ప్రకాష్ రెడ్డి అని ప్రశ్నించారు. నీవు, నీ సోదరులు చేసిన దుర్మార్గాలు ఇప్పటికి రాప్తాడు ప్రజలు మరువలేదు.. నీ సొంత పార్టీ కార్యకర్తలను కూడా వదలకుండా కోట్ల రూపాయలు అప్పులుగా తీసుకోని తిరిగి డబ్బులు అడిగితే దౌర్జన్యం చేసింది వాస్తవం కాదా, ఇంత కంటే దుర్మార్గం ఏదన్నా ఉంటుందా అని ప్రశ్నించారు. తోపుదుర్తి గ్రామంలో గ్రామ ప్రజలు చందాలు వేసుకొని ఊరు దేవర జరుపుకొని, చందాలు వేసుకున్న డబ్బులు 14 లక్షలు మిగిలితే ఆ డబ్బులు కూడా మీ అన్న తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి అలియాస్ చందు తీసుకున్నది వాస్తవం కాదా, రాప్తాడు మండలంలో ఉన్న జాకీ పరిశ్రమను డబ్బులు కోసం వారిని బెదిరించి జాకీ పరిశ్రమను వెళ్లగొట్టింది నిజం కాదా.. నియోజకవర్గంలో అన్నదమ్ములు మధ్య భూ తగాదాలు పెట్టి అక్రమంగా భూములు రిజిస్ట్రేషన్ చేసుకొని ఇదేమి అన్యాయం అని అడిగితే.. నాపై అక్రమంగా కేసులు పెట్టించి రౌడీ షీట్ ఓపెన్ చేపించి జైల్లో పెట్టింది నిజం కాదా ప్రకాష్ రెడ్డి అని ప్రశ్నించారు. 2024లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రెండేళ్ల నుంచి రాప్తాడు నియోజకవర్గంలో ఉన్న ప్రతి గ్రామంలో కూడా దాదాపు 125 కోట్ల రూపాయలు వెచ్చించి సిమెంట్ రోడ్డు వేయించారు.. నీ కళ్ళు ఏమన్నా మూసపోయాయో ఒక్కసారి నియోజకవర్గం అంతా తిరిగి కళ్ళు పెట్టి చూడు ప్రకాష్ రెడ్డి సూచించారు. పేరూరు డ్యాం అభివృద్ధి కోసం 805 కోట్ల రూపాయలు బడ్జెట్ ను నీ అధికారాన్ని అడ్డం పెట్టుకొని మూడు ముక్కలు చేస్తే టీడీపీ అధికారం వచ్చిన వెంటనే తిరిగి పేరూరు డ్యాంకు సాగునీరు తీసుకెళ్లాలని పనులు పునః ప్రారంభం చేసింది కళ్లు తెరిచి చూడాలన్నారు. పరిటాల కుటుంబంపై కారు కూతలు, తప్పుడు ఆరోపణలు చేస్తే నీ నాలుక చిలేస్తాం ఖబర్దార్.. అంటూ బండి పరశురాం హెచ్చరించారు. నీ బతుకు నియోజకవర్గం ప్రజలకు తెలిసే నిన్ను పరిటాల సునీతమ్మ చేతిలో మూడుసార్లు ఓడించారు, ఇంకా నీకు బుద్ధి రాలేదంటే నీలో సిగ్గు, చీము, రక్తం ఎక్కడ ఉందో తెలియాలి ప్రకాష్ రెడ్డి.. నీ జీవితం అంతా అవినీతి, అక్రమాలు, దందాలు, దౌర్జన్యాలు, కుట్రలు, కుతంత్రాలే అన్నారు. రాప్తాడు నియోజకవర్గం ప్రజల భవిష్యత్ పరిటాల కుటుంబ బాధ్యత కాబట్టే నియోజకవర్గంలో ఉన్న ప్రతి చెరువుకు సాగునీరు, తాగునీరు అందిస్తూ ప్రజల సంక్షేమం కోరుకుంటున్న ఇలాంటి కుటుంబంపై నీవు ఎన్ని తప్పుడు ఆరోపణలు చేసినా.. ప్రజలు నీ మాటలను నమ్మే పరిస్థితి లేదన్నది గుర్తించుకోవాలని సూచించారు.

# నీట్ పరీక్షా లీకేజ్ కు నైతిక బాధ్యత వహిస్తూ..

**- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి**

అనంతపురం, జూన్ 6 అనంత సూర్య న్యూస్ : దేశవ్యాప్తంగా మే 4వ తేదీన జరిగిన నీట్ ప్రవేశ పరీక్షలలో 28 లక్షలకు పైగా రాశారని, పేపర్ లీకేజ్ జరిగిందని.. పరీక్షను రద్దు చేయడం జరిగిందని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేందర్ ప్రధాన్ రాజీనామా చేయాలని ఏఐఎసఎఫ్ జాతీయ సమితి పిలుపులో భాగంగా అనంతపురం నగరంలో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎసఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పేద, మధ్య తరగతి విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని మండిపడ్డారు. దాదాపు 28 లక్షల మంది విద్యార్థులకు పైగా ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల విద్యను పూర్తి చేసుకొని నీట్ ప్రవేశ పరీక్ష ప్రిపేర్ అయ్యి మరి కొంత మంది విద్యార్థులు లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకొని పరీక్ష రాస్తే ఇప్పుడు పరీక్ష పేపర్ లీకేజ్ అయిందని, నీటి పరీక్షను రద్దు చేయడం జరిగిందన్నారు. నీటి ప్రవేశ పరీక్షకు విద్యార్థులు అప్లై చేసుకుని చాలా రోజుల నుంచి ప్రిపేర్ అయ్యి వివిధ జిల్లాల నుంచి వివిధ జిల్లాలకు పోయి పరీక్ష రాస్తే.. పేపర్ లీకేజ్ అయిందని రద్దు చేశారన్నారు. విద్యార్థుల సమయాన్ని కేంద్ర ప్రభుత్వం వృధా చేయడమే కాకుండా వారి ఆశలను పోయేవిధంగా చేసిందని మండిపడ్డారు. గత సంవత్సరం కూడా ఇదే తరహాలో హర్యానా బీహార్ రాష్ట్రాలలో నీట్ పరీక్ష పేపర్ను 30 లక్షల నుంచి 50 లక్షల రూపాయల వరకు అమ్ముకొని లీకేజ్ చేశారని గుర్తు చేశారు. ఈ సంవత్సరం కూడా అదే తరహాలోనే డబ్బులకు నీట్ పేపర్ను అమ్ముతున్నారని మండిపడ్డారు. చాలా మంది విద్యార్థులు బాగా చదువుకొని నీట్ ప్రవేశ పరీక్షలో సీటు కొట్టాలన్న ఆశతో పరీక్ష రాస్తే కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పేపర్ ను లీకేజ్ చేయడం జరిగిందన్నారు. దీంతో విద్యార్థుల జీవితాలు తీవ్రంగా నష్టపోతాయని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్ టీ ఏ ఏజెన్సీ ద్వారా నీటి ప్రవేశ పరీక్షను కేంద్ర ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాల నుంచి నిర్వహిస్తోందని, ఈ కొన్ని సంవత్సరాలలోనే రెండుసార్లు లీకేజ్ కావడం కేంద్ర ప్రభుత్వం నీటి ప్రవేశ పరీక్షపై ఎంత శ్రద్ధ చూపిస్తుందో అర్థం చేసుకోవాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి నీటి ప్రవేశ పరీక్ష లీకేజ్ ఘటనపై ఇది రెండవసారి జరగడం, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఎన్ టీ ఏ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎసఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, నగర అధ్యక్షులు మంజునాథ్, జిల్లా సహాయ కార్యదర్శి చందు, నగర నాయకులు హరికృష్ణ, తేజ, సుశ్రుత్, రాజు, బాషా, యశ్వంత్, కార్తీక్, ఉమేష్, బబ్లు, సురేష్, బ్రహ్మ, స్వామి, నరేష్, సాయి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ అడ్వాన్స్డ్-2026లో శ్రీచైతన్య విద్యార్థుల ఘన విజయం



అనంతపురం, జూన్ 6 అనంత సూర్య న్యూస్ : ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్డ్-2026 ఫలితాలలో శ్రీ చైతన్య విద్యాసంస్థల అనంతపురం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థి కొణంకి సమిత్ చౌదరి అఖిల భారత స్థాయిలో 62వ ర్యాంకు (ఎయిర్-62) సాధించగా, మరో విద్యార్థి అభిషేక్ కాంత్ 92వ ర్యాంకు (ఎయిర్-92) సాధించి సంస్థకు, అనంతపురం జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. అంతేకాకుండా శ్రీ చైతన్య అనంతపురం విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్డ్-2026లో అఖిల భారత స్థాయిలో 100లోపు 2 ర్యాంకులు, 1000లోపు 4 ర్యాంకులు సాధించి తమ ప్రతిభను దేశవ్యాప్తంగా చాటుకున్నారు. ఇక ఇటీవల విడుదలైన ఆంధ్రప్రదేశ్ పదవ తరగతి ఫలితాలలో కూడా శ్రీ చైతన్య విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. రాగసాయి, ఆర్యేంద్ర, శ్రేష్ఠ, శ్రీజ 600కు 597 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలను నమోదు చేసి సంస్థకు విశేష కీర్తి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఐఐటీ ర్యాంకర్లు, ఎసఎస్సీ టాప్ ర్యాంకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి.. జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యార్థులు సాధించిన జాతీయ, రాష్ట్రస్థాయి విజయాలను అభినందించిన కలెక్టర్.. యువత లక్ష్యసాధనకు కృషి, క్రమశిక్షణ, అంకితభావం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి జిల్లా, రాష్ట్రం, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, శ్రీచైతన్య ప్రతినిధుల బృందం జిల్లా పోలీసు అధికారి జగదీష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. జేఈఈ అడ్వాన్స్డ్, ఎసఎస్సీ ఫలితాలలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. విజయానికి ప్రత్యామ్నాయం కృషి మాత్రమేనని, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల విజయాల వెనుక తల్లిదండ్రుల నమ్మకం, అధ్యాపకుల అంకితభావం, విద్యార్థుల క్రమశిక్షణ, శ్రీ చైతన్య విద్యాసంస్థల శాస్త్రీయ బోధనా విధానం ప్రధాన కారణాలని తెలిపారు. భవిష్యత్తులో కూడా జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించే విద్యార్థులను తీర్చిదిద్దేందుకు సంస్థ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సమీనా ఖాన్, విశ్వనాథ్, నరేష్, వెంకటేష్, కోఆర్డినేటర్లు రాధాకృష్ణ నాయుడు, తిరుమలేశ్వర్ రెడ్డి, ఇర్షాద్ అహ్మద్, నాగభూషణం, డీన్లు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, ఇతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.



Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405